తియని ప్రయాణం

"వెళ్ళొస్తానమ్మా" అంది అనసూయ, చెప్పుల్లో కాళ్ళు దూరుస్తూ

"ఉఁ వెళ్ళు, అట్టే రోజులు ఉండి పోకు" అంది ఈశ్వరమ్మ అనసూయ తల్లి

"అలాగే" అంది అనసూయ వీధిలోకి వస్తూ

ఈశ్వరమ్మ ఎప్పటిలా కూతురితో పాటుగ వీధిలోకి రాలేదు ఇంట్లోనే ఉండిపోయింది ఆవిడకు కూతురి ప్రయాణం ఏ మాత్రం ఇష్టంలేదు

అనసూయ బాధపడింది క్షణం సేపు తల్లికి అయిష్టమయిన పని చేస్తున్నానే అని కాని, తను విశాఖపట్నం వెళ్ళక తప్పదు

వీధరుగుమీద నుంచుని, ఖాళీ రిక్షాకోసం ఎదురు చూడసాగింది

అయిదు నిముషాల తర్వాత ఓ ఖాళీ రిక్షా అటు వైపు వస్తే స్టేషనుకు బేరమాడి ఎక్కి కూచుంది

పావు గంటలో రిక్షా రైల్వే స్టేషనుకు చేరుకుంది టిక్కెట్టుకొని, ప్లాట్‌ఫారం మీదకు ఆమె వచ్చిన అయిదు నిముషాల్లో రైలొచ్చింది

ఆడవాళ్ళ కంపార్టుమెంటు వెదికి పట్టుకుని ఎక్కింది కంపార్టుమెంటు ఖాళీగా ఉంది కిటికీకి ప్రక్కన సీటు చూసుకుని కూచుంది

కంచర్ల రమణ

పావుగంట తర్వాత బండి బయలు దేరింది

స్టేషన్లు ఒకదాని తర్వాత ఒకటి వెనక్కి వెళ్ళిపోతున్నాయి కాని, అనసూయ మనస్సు మాత్రం తనున్న ప్రపంచంమీద లేదు

'విశాఖపట్నంలో ఉన్న తన స్నేహితురాల్ని అర్జంటుగా కలుసుకోవాలి' అన్న సాకు చెప్పి, విశాఖపట్నంలో ఉన్న రామచంద్రాన్ని కలుసుకోవడానికి బయలు దేరింది అనసూయ

అనసూయ అకస్మాత్తుగా విశాఖపట్నం బయలుదేరడానికి కారణం, పది రోజుల క్రితం రామచంద్రంనుంచి వచ్చిన ఉత్తరం

''అనూ! ఎందుకింకా నామీద ఆశలు పెంచుకుంటావు పెళ్లయి నాకు ఇద్దరు పిల్లలు ఇహ పిల్లలు పుట్టకుండా ఆపరేషను కూడా చేయించుకొన్నాను నా వయస్సు ఇప్పుడు ముప్పై ఆరేళ్లన్న మాటేగాని, ప్రేమ పెళ్లి వగైరా విషయాలు ఆలోచించే దశ ఏనాడో దాటిపోయింది ఇహ నేను ఆలోచించవలసింది నా పిల్లలు పెద్దవాళ్లయి భవిష్యత్తులో బాగుపడ్డం ఎలా అని

చిలకలా చెప్పిందే చెప్తున్నాననుకోకు ఎస్సెల్సీ రెండుసార్లు పోయిందని, మరి ఆ విషయం తలవడమే మానేసావు ఇప్పుడు ఆ పరీక్షలు లేకపోయినా, మెట్రిక్‌కు కట్టు గట్టిగా చదివితే పాసయి తీరతావు నీ దృష్టి అలా చదువుమీదకు మళ్ళించు నీ జీవితానికో లక్ష్యం ఏర్పడుతుంది పరీక్ష పాసయి చిన్న ఉద్యోగం నీవు సంపాయించుకోగలిగితే, మంచి పెళ్లి సంబంధం కూడా ఎస్తుంది నా మాట విను '' అని ఉత్తరం రాసాడు రామచంద్రం

ఉత్తరంలోని ప్రతి మాటా తనకు గుర్తే వచ్చాక దాన్ని అయిదారుసార్లన్నా చదివింది

రామచంద్రం వద్దనుంచి ఉత్తరం వచ్చినప్పుడల్లా ఏడ్చేది అనసూయ కాని, ఈసారి దుఃఖానికి బదులు కోపం పొంగుకుని వచ్చింది ఉత్తరం చదివిన ప్రతి తడవకూ ఆమె కోపం హెచ్చిందే గాని ఉపశమించలేదు

రామచంద్రానికీ, అనసూయకూ ప్రథమంగా ఓ బంధువులింట్లో పరిచయం ఏర్పడింది అప్పటికి రామచంద్రానికింకా పెళ్లి కాలేదు

పరిచయం ప్రేమగా మారి ''మనిద్దరం పెళ్లి చేసుకుందాం అని ఒకరికొకరు వాగ్దానం చేసుకునే దశకు రావడానికి రామచంద్రం ఆ బంధువులింట్లో ఉన్న మూడు రోజులు సరిపోయాయి

వారానికి రెండు ఉత్తరాల చొప్పున సంవత్సరంపాటు వారిద్దరి ప్రణయం కొనసాగింది ఈ లోపున వాళ్లు రెండుమూడుసార్లకు మించి కలుసుకోవడం జరగలేదు అప్పుడు కూడా ఒకరికి దగ్గరగా ఒకరు కూచోవడం, చేతులు కలుపుకోవడం, మరీ ఆవేశం పైబడితే ముద్దుపెట్టుకోవడానికి మించి దూరం పోలేదు వారి ప్రేమాయణం

విచిత్రమైన పరిస్థితులవల్ల రామచంద్రం అనసూయను పెళ్లి చేసుకోలేదు తల్లి



దండ్రులు తెచ్చిన సంబంధం చేసుకొన్నాడు

తను ఎలాంటి పరిస్థితులకు లొంగిపోయి తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధం చేసుకోవాల్సివచ్చిందో, వివరంగా పెద్ద ఉత్తరం రాసాడు రామచంద్రం అనసూయకు

ఆ ఉత్తరం చదివి కన్నీరుమున్నీరుగా ఏడ్చింది అనసూయ తను బాధపడినంతగా, రామచంద్రం కూడా బాధపడ్డాడని అతను రాసిన ఉత్తరంలోని ప్రతి మాటా పలుకుతోంది కానయితే రామచంద్రం రాజీపడ్డాడు పరిస్థితులతో

అందుకే రాసాడు, ఉత్తరం చివరలో ''నిన్ను నేను మర్చిపోలేను అనూ ప్రేమికులుగా గాకపోయినా, స్నేహితులుగానైనా మనం ఉత్తరాలు రాసుకుంటే తప్పేమిటి? ఉత్తరాలు రాయడం మానీకు అనూ''

వారం రోజులపాటు ఇహ రామచంద్రానికి ఉత్తరం రాయకూడదనుకుంది అనసూయ

కాని, రామచంద్రానికి ఉత్తరాలు రాయకుండా ఉండలేకపోయింది

'తాము ప్రేమికులు కాదు స్నేహితులు మాత్రమే' అని వారు ఉత్తరాలు కొనసాగిస్తున్నప్పటికీ అప్పుడప్పుడు పాత ప్రేమలు ప్రస్తావనలోకి రావడం మానలేదు

అలాంటి సమయాల్లో అనసూయ గుండెలు బద్దలయ్యేవి దుఃఖంతో తానను భవించిన మానసిక యాతన గురించే రాసేది అనసూయ ఆ తరువాతి ఒకటి రెండు ఉత్తరాల్లో

అయిదేళ్లు గడిచిపోయాయి ఈ అయిదేళ్లలో నాలుగయిదుసార్లు కలుసుకున్నారు రామచంద్రం, అనసూయలు

రామచంద్రం కనిపించినప్పుడు అనం

దంతో ఎంత పొంగిపోయేదో, అతడు వెళ్ళిపోగానే, అంతగానూ కుంగిపోయేది అనసూయ ఆ తరువాత వారం పది రోజులవరకూ ఆమెకు నిద్ర వచ్చేది కాదు తిండి సహించేది కాదు అసలు మానవమాత్రుడ్నెవడ్నీ చూడాలనిపించేది కాదు మోకాళ్ల మధ్య తల పెట్టుకుని రొదిస్తూ ఒంటరిగా చీకటిగదిలో కూచునేది

గడచిన అయిదేళ్లల్లో రామచంద్రంకు ఇద్దరు పిల్లలు కలిగారు కష్టపడి డిపార్టుమెంటు పరీక్షలు పాసయి ఉద్యోగంలో రెండు మెట్లు పైకెక్కాడు

అనసూయ పోయిన స్కూల్‌ఫైనల్ పరీక్ష గురించి మరి తలవలేదు అయితే ఈలోపున ఎవరో సలహా ఇచ్చారు ఆమెకు హిందీ పరీక్షలు పాసవడం సులువని, హిందీ పండిట్‌గా ఉద్యోగం సంపాయించుకోవడం కూడా సులువని

అనసూయ హిందీ పరీక్షలకు కట్టసాగింది రెండు పరీక్షలు పాసైంది మూడవది పాసైతే హిందీ పండిట్ అవుతుంది ఆ పరీక్ష పాసైతే, ఉద్యోగం ఇప్పిస్తానని ఓ పెద్ద మనిషి వాగ్దానం కూడా చేసాడు అయితే ఆ పరీక్షకు రెండు సార్లు వెళ్ళి తప్పింది

మూడవసారి ఆ పరీక్షకు వెళ్తుంటే, ఆమెలో అంతర్మథనం మళ్లా మొదలైంది

అటు ప్రేమలోనూ, ఇటు జీవితంలోనూ దేవుడిలా తనను అన్యాయం చేసాడేం?

రామచంద్రం పదేపదే గుర్తుకు రాసాగాడు అతడు వివాహితుడు పిల్లల తండ్రి అన్న విషయం సైతం లక్ష్యం చెయ్యకుండా, అతన్ని తన కలల్లో నింపుకోసాగింది

అయినప్పటికీ, అప్పుడప్పుడు అతడికి పెళ్లయిందన్న విషయం ముల్లులా ఆమె మనస్సును చురుక్కుమని బాధించక పోలేదు

'అయితేనేం? తనను రెండో భార్యగా స్వీకరిస్తాడు లేదా ఉంచుకుంటాడు లోకంలో ఇలాంటి ఏర్పాట్లతో ఎంత మంది బ్రతకడంలేదు? అనుకుంది మొండిగా

దాంతో మళ్లా రామచంద్రంతో తన జీవితం పంచరంగుల్లో ఊహించుకోసాగింది

అయితే, రామచంద్రంనుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు అలాగని ఉత్తరాలు రాయడం మానలేదు

ఒకానొక సందర్భంలో 'రామచంద్రం తన జీవితంతో ఆడుకోవటం లేదు గదా?' అన్న అనుమానం వచ్చింది ఆమెకు ఒక్కసారి, ఆ కోణంలోంచి గతాన్నంతా పునఃపరిశీలన చేసింది అంతే'

ఆ అనుమానం బలపడనారంభించింది

తన జీవితంతో ఆటలాడుకోవాలన్న ఉద్దేశమే రామచంద్రానికి లేకపోతే, పెళ్ళయిన వెంటనే తనకు ఉత్తరాలు రాయడం ఎందుకు మానలేదు?

పెళ్ళయి పిల్లలు కలిగాక కూడా, ఎందుకు తనను కలుసుకోవడానికి ఉబలాట పడ్డాడు?

'స్నేహితులుగా ఉత్తరాలు రాసుకుందాం' అని రామచంద్రం ఉత్తరాలు

కొనసాగించడంలోనే అతడి ఉద్దేశం బయటపడుతోంది

రామచంద్రం తనను ప్రేమించలేదు తనంటే ఒక స్త్రీ పడి ఛస్తోంది అన్న భావాన్ని, అనుభూతిని ప్రేమించాడు అందుకే తనను ఉత్తరాలు రాయమన్నాడు తను రాసాడు

క్రమంగా రామచంద్రం మీద ప్రేమ ద్వేషంగా మారింది కసి కలిగించి అయితే తను ఆడది, అతడ్ని ఏం చెయ్యగలదు?

పెళ్ళయి పిల్లలతండ్రి అయ్యాక కూడా, అతనితో తను ఉత్తరాలు నడిపిందంటే, లోకం తననే దోషిగా పరిగణిస్తుంది

ఏది ఏమైనా తన బ్రతుకు ఒక అర్థం లేని వ్యవహారంగా మారింది

రామచంద్రం గట్టుమీంచి చూసి ఆనందిస్తున్నాడు తను కష్టాల కెరటాల తాకిడికి ఉక్కిరి బిక్కిరయి ఛస్తుంటే

లాభం లేదు' రామచంద్రం శిక్ష అనుభవించకుండా తప్పించుకోవడానికి వీలులేదు

అయితే, యేం చెయ్యాలి తను?

అనసూయ తీవ్రంగా ఆలోచించింది, రెండు రోజులు

కొద్ది నెలల్లో తనకు ఇరవై యెనిమిదేళ్ళు నిండిపోతాయి పెద కట్నాలు యిస్తేగాని తనను పెళ్ళి చేసుకునే విశాల హృదయుడు కనుచూపు మేరలో ఎవడూ లేడు తన బ్రతుకు యెలాగూ గాడీ తప్పిన బండి అయ్యింది

తన భర్త శ్రీరామచంద్రుడంతటి ఏకపత్నీవ్రతుడన్న నమ్మకంతో వుండి వుంటుంది రామచంద్రం భార్య పెళ్ళికాక పూర్వం తనతో ప్రేమ వ్యవహారం నడిపాడని ఆమెకు చెప్పి ఆమె నమ్మకాన్ని

దెబ్బ తీస్తే

ఆ మాత్రం చాలు! స్వర్గంలాంటి అతని యిల్లు దుర్భర నరకమవుతుంది అనుకూలవతి అనురాగవతి అయిన అతని యిల్లాలు అతడి మొదటి శత్రు వవుతుంది

అందుకే అనసూయ బయలుదేరింది విశాఖపట్నం, రామచంద్రం మీద కసితో, కుతకుతలాడిపోతున్న మనస్సుతో

సాయంకాలం అయిదు కావస్తుండగా రైలు విశాఖపట్నం చేరుకొంది రిక్షా కట్టించుకుని, డాబా గార్డెన్‌లో ఉన్న రామ చంద్రం యింటికి వెళ్ళేసరికి, పావు తక్కువ ఆరయింది

అప్పుడే ఆఫీసు నుంచి వచ్చినట్టు న్నాడు రామచంద్రం యింటి వద్దనే ఉన్నాడు అనసూయ తలుపు తట్టగానే అతడే తలుపు తీసాడు

చేతిలో సంచీతో, మొహంలో తీక్షణ మైన చూపుతో ఎదురుగా నించున్న అన సూయను చూడగానే ఆశ్చర్యపోయాడు రామచంద్రం

"నువ్వా? అనసూయా? ఎవరో అను కున్నాను ఏమిటిలా వచ్చావు?" అన్నాడు రామచంద్రం

తనలా రావడం అతనికి యిష్టం లేదు అందుకే అలా ప్రశ్నించాడని అర్థం చేసుకుంది అనసూయ

"యేం? నేను రావడం యిష్టం లేదా?" అడిగింది అనసూయ సీరియస్‌గా అతడి కళ్ళల్లోకి చూస్తూ

రామచంద్రం మొహం నల్లబడింది కాని, మరునిముషంలోనే తేరుకుని-

"ఛ! ఛ! ఏమిటా మాటలు?" అంటూ అనసూయను లోనికి తీసుకెళ్ళాడు

నడవలోంచి రామచంద్రం భార్య చూస్తోంది ఆసక్తిగా, ఎవరొచ్చారా అని

"అనసూయని నాకో ప్రాణస్నేహితు రాలుందని చెప్పానే, ఆమే యీమె" అంటూ భార్యకు అనసూయను పరిచయం చేసి "ఈమె నా భార్య నా అర్ధాంగి నా మిసెస్ వగైరా వగైరా అన్న పూర్ణ నామధేయురాలు" అంటూ నాటక ఫక్కీలో తన భార్య అన్నపూర్ణను పరి చయం చేసాడు

అన్నపూర్ణ గలగలా నవ్వేసింది ఆమెలా అనసూయ కూడా నిర్మలంగా యింకోకప్పుడయితే నవ్వి ఉండేది అలాగని సీరియస్‌గా కూడా వుండలేక పోయింది చిన్న చిర్నవ్వు మాత్రం మొహం మీదకు తెచ్చుకుంది

ఈ లోపున రామచంద్రం యిద్దరి పిల్లలూ అక్కడకు చేరారు, అనసూయను ఎగాదిగా చూస్తూ

"ఎవరు నాన్నా ఆవిడ?ఎవరునాన్నా?" అడిగింది పెద్దపిల్ల రామచంద్రం ప్రక్కకు చేరి, అతడి చెయ్యి లాగుతూ

"ఎవరా?" అని ఆగి అనసూయ మొహంలోకి, కూతురి మొహంలోకి క్షణంసేపు చూసి బుంగమూతి పెట్టి "ఉహూం నేను చెప్పను చెప్పడానికి పావలా చార్జి అవుతుంది" అన్నాడు చిలిపిగా

"ఓకే నాన్నా! పావలాయేగా రూపాయి యిచ్చాను పో! చెప్పు మరి" అంది అమ్మాయి- తండ్రి అంత చిలిపిగా

"అయితే ఆమె నీకు ఆంటీ అవుతుంది తే రూపాయి" అన్నాడు రామచంద్రం కూతురి మొహంలోకి తమాషాగా చూస్తూ

"వాళ్లేంటి తండ్రి కూతుళ్ళ హాస్యాలు! ఇంటికి వచ్చినవారికి మర్యాద చెయ్యడం ఏమన్నా వుందా లేదా? అంది అన్నపూర్ణ మధ్యలో జోక్యం కలిగించుకుని

"ఇదిగో డియర్! పరిచయాలు చెయ్యడం నా వంతు ఆ పని కానిచ్చాను మిగతాదంతా నీ పనే" అని అక్కడున్న ఓ కుర్చీలో కూలబడ్డాడు రామచంద్రం

"రండి! ఆయనతో మనకేమిటి?" అంటూ అనసూయ చెయ్యి పుచ్చుకుని లోనికి తీసుకెళ్ళింది అన్నపూర్ణ

అనసూయ ఎంత వద్దంటున్నా అనసూయ స్నానం కోసం నీళ్ళు ఏర్పాటు చేసింది అన్నపూర్ణ

పది నిముషాల్లో అనసూయ స్నానం ముగించుకుని వచ్చేసరికి, ఓ ప్లేటులో పొగలు కక్కుతున్న ఉప్మా, ఇంకో చేతిలో కాఫీ గ్లాసుతో ఎదురయ్యింది అన్నపూర్ణ

ఫలహారం చేస్తోందన్న మాటేగాని, అనసూయ మనస్సు అల్లకల్లోలంగా ఉంది

తను వచ్చింది, రామచంద్రం బ్రతుకు బండలు చెయ్యడానికి వారి ఆతిథ్యం స్వీకరించడానికి కాదు

రేపు తను రామచంద్రానికీ తనకూ మధ్య జరిగిన ప్రణయ వ్యవహారం గురించి ఆమెకు చెబితే తను కన్పరిచిన ఆప్యాయతకూ యిచ్చిన ఆతిధ్యానికి అన్నపూర్ణ ఎంత నొచ్చుకుంటుందో? నొచ్చుకోనీ? తనకేం! తను బాధలు పడ్డప్పుడు ఎవరైనా అలా అనుకున్నారా? అలా అనుకుంటే, తనీ దుస్థితిలో ఉండేదా?

వాళ్ళు అందించిన ఆతిథ్యమంతా పుచ్చుకుని, పెళ్ళున కొట్టినట్టుగా రామచంద్రం బండారం బయట పెట్టడంతోనే ఉంది రక్తి

"చాలా థేంక్సండీ" అంది అనసూయ కాఫీ త్రాగాక కాళీ గిన్నెలు కడిగి తీసుకురావడానికి లేచింది చేతిలో గిన్నెలతో

"ఛ! ఛ! యీ మాత్రందానికేనా థేంక్సు?" అంది అన్నపూర్ణ, అనసూయ చేతిలోని గిన్నెలు లాక్కుంటూ

"ఆఁ యిప్పుడు చెప్పు మీ అమ్మగారెలా వున్నారు?" రామచంద్రం అక్కడకు వచ్చి అన్నాడు

గిన్నెలు కడగడానికి అన్నపూర్ణ లోనికి వెళ్ళిపోయింది

"బాగానే ఉన్నారు" క్లుప్తంగా జవాబిచ్చింది అనసూయ

"మీ అక్కా వాళ్ళూ?"

"ఆఁ వాళ్ళూ బాగానే ఉన్నారు"

"మరి, మీ అక్కగార్కి ఆ యిద్దరు పిల్లలేనా? ఆ తరువాత కూడా ఏమన్నా" అంటూ తన బొజ్జపైన చెయ్యి పైకీ క్రిందికీ పుటాకారం సూచిస్తూ త్రిప్పాడు

ఆ క్షణంలో రామచంద్రం మీద ఏ కోపమూ లేకపోయి ఉంటే అనసూయ విరగబడి నవ్వేసేది రామచంద్రం యాక్షనుకి అయినా ఎంత సీరియస్‌గా ఉందామన్నా ఉండలేకపోయింది

చిరునవ్వు నవ్వక తప్పలేదు

"ఆహాఁ మరి లేరు" అంది ఆ చిన్నవ్వు కూడా ఆపుకుంటూ

"మీ అన్నయ్య ఏమాత్రం డబ్బు పంపుతున్నాడిప్పుడు?"

"నెలకు వంద"

"కొంత నయం మునుపు పాతికే పంపేవాడు"

ఆ తరువాత ఇంకేం కుశలప్రశ్నలు వెయ్యాలో రామచంద్రానికి బోధపడలేదు

"ఇవాళ రెండో ఆట సినిమాకు వెళ్దాం తయారై కూర్చోండి ఈ లోపున నాకో చిన్న పనుంది వస్తా" అంటూ రామచంద్రం అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు

ఆ సమయంలోనే, రామచంద్రం గురించి చెప్పాల్సినవి అన్నపూర్ణకు చెప్పేద్దామనుకుంది అనసూయ కాని



మనసు మార్చుకుంది "ఇద్దరి సమక్షం లోనె రామచంద్రం పాపఫలం బద్దలు కొడతాను అనుకుంది

రాత్రి తొమ్మిదవుతుండగా భోజనా లయ్యాయి పిల్లల్ని తీసుకుని బయలు దేరారు రామచంద్రం అన్నపూర్ణ అన సూయ గూడా వారితోపాటుగ సినిమాకు వెళ్లక తప్పలేదు వాళ్లంతా బలవంతం చేసారు

ఇంటర్వెల్‌లో పిల్లలు కూల్‌డ్రింక్స్ కొసం అల్లరి చేసారు తనకేమీ అక్క ర్లేదనీ, అన్నపూర్ణ హాలులోనే ఉండి పోయింది అన్నపూర్ణతోపాటుగ తనూ ఉండిపోతానంది అనసూయ

రామచంద్రం ఊరుకోలేదు పిల్లలతో పాటుగ బయటకు వచ్చి కూల్‌డ్రింక్ త్రాగి తీరాలని అనసూయను పట్టుబట్టాడు అయిష్టంగానైతేనేం, అనసూయ వెళ్ళింది

కూల్‌డ్రింక్స్ త్రాగుతున్నప్పుడు అడి గాడు రామచంద్రం "ఏమిటిలా హఠా త్తుగా మా మీద దయ పుట్టుకొచ్చింది?' అని

సాయంకాలంలాగే వాడిగా ఏదో జవా బిద్దామనుకుంది అనసూయ ఆ సంగతి రామచంద్రం అర్థం చేసుకున్నట్టున్నాడు ఆమె మాట్లాడ్డానికి పెదవి కదిపేంతలోనే "అహ(' నువ్వు రావడం ఏమాత్రం ఇష్టం లేదనుకోకు సుమీ నువ్వు ఇల్లు కదిలి ఇంతదూరం వచ్చావంటే ఏదో ముఖ్యమైన పనేదో ఉండివుండాలి అది తెలుసుకుందామని అని అన్నాడు

ఆ మాటలతో దురుసుగా సమాధానం ఇచ్చే తన ప్రయత్నం విరమించుకుంది అనసూయ ఎప్పటిలా మొహంమీద చిరు నవ్వు ధరించి "రేపు చెప్తానులే అదంతా సస్పెన్సుగా ఉంచడం నా కిష్టం రేపటి వరకు ' అంది

"అబ్బా' అంత సస్పెన్సేమిటి?"

అని ఇంకా రామచంద్రం ఏదో అన బోతుంటే, ఇంటర్వెల్ ముగిసినట్టు గంట మ్రోగింది త్వరత్వరగా అందరూ హాలు లోకి వెళ్లిపోయారు

పావు తక్కువ ఒంటిగంట కావస్తుండగా సినిమా అయిపోయింది

పిల్లలు పడుకున్న గదిలో అనసూయకు ప్రక్క ఏర్పాటుచేసింది అన్నపూర్ణ

ఎందుకో అవాళ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయింది అనసూయ

ఉదయం అయిదు గంటలకే ఆ ఇల్లు మేల్కొంది ఎనిమిది గంటలకే రామచంద్రం ఆఫీసుకు వెళ్ళారెమో, అన్నపూర్ణతోపాటుగ రామచంద్రం కూడా లేవాడు స్నానాదికాలు ముగించుకుని వచ్చేలోపల అతనికి టిఫిను తయారుచేసి ఇచ్చింది అన్నపూర్ణ ఆ తరువాత ఇంకో గంటలో వచ్చే కారియర్ మనిషికి కారియర్ అందివ్వడానికి వంట గూడా ఉపక్రమించింది

అనసూయకు కూడా తెల్లవారుఝామున అయిదు గంటలకు లేచే అలవాటుంది అందువల్లనే, అలారం విన్నట్టుగా టక్కున ఆమెకు గూడా మెలకువ వచ్చింది

వాళ్ల పనులకు అడ్డం పడ్డం తప్ప లేచి తను చేసేదేమీ లేదని తెల్సుకుని మంచంమీద అలాగే పడుకుని నిద్ర నటించసాగింది

ప్రక్క గదుల్లోంచి భార్యాభర్తల సంభాషణ స్పష్టంగా వినవస్తోంది అనసూయకు

''అనసూయను చూస్తుంటే నా గుండెలు పగిలిపోతున్నాయి పూర్ణా' అంటున్నాడు రామచంద్రం

''బాధపడి మనం మనస్సులు పాడు చేసుకోవడం తప్ప ఆమె కేవిధంగా ఉపయోగపడగలం చెప్పండి' అంటోంది అన్నపూర్ణ

''అదేమిటో పూర్ణా' దేవుడు కరుణామయుడంటారు కాని ఆమె విషయంలో మాత్రం బండరాతి బొమ్మ అటు పరీక్షల్లో తప్పుతోంది ఇటు పెళ్ళి జరిగే అవకాశం లేదు ఆమె అన్ని బాధ్యతలూ మీదను వేసుకుని తండ్రిలా ప్రవర్తించవాల్సిన అన్నయ్య వీళ్ళను దూరంగా వుంచి భరణం ఇస్తున్నట్టు నెలకింతని డబ్బు వీళ్ళ మొహాన్న కొడుతున్నాడు అని అనసూయ పరిస్థితులు రామచంద్రం చెప్తుంటే బ్రతుకులో ఉన్న తమాషా యేమిటోగాని కొంతమంది బాధపడ్డానికే పుట్టినట్టు నానా అవస్థలు పడతారు ఎటు ఆశగా తిరిగితే అటు నుంచే దెబ్బ తగులుతుంది' అని అన్నపూర్ణ వ్యాఖ్యానించింది

''ఇహ లాభంలేదు పూర్ణా' చిన్నదో చితకదో ఓ ఉద్యోగం అనసూయకు చూస్తాను ఏ ఆనందమూ, ఏ తృప్తీ లేకుండా అనసూయ బ్రతుకు శిథిలమయి పోతుంటే చూస్తూ ఊరుకోలేను

రామచంద్రం కంఠంలో దృఢ నిశ్చయం ధ్వనించింది

''అలాగే చెయ్యండి మనల్ని మనం ఉద్ధరించుకోవడంలో గొప్పతనం లేకపోలేదు కారణం ఏమంటే మనం సమాజానికి బరువు కావడం లేదు అయితే ప్రతి మానవుడు తనను తాను అర్ధం చేసుకోవడంతోనే సమాజంపట్ల తన

కర్తవ్యం పూర్తయిందనుకోగూడదు ఇంకొకర్ని ఉద్ధరించె కనీస యత్నమన్నా చెయ్యాలి'' అంది అన్నపూర్ణ

''సైమయిపోయింది పూర్ణా' వెళ్ళొస్తాను

ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది

ఆ తరువాత రామచంద్రం వీధిలోకి కదిలి వెళ్ళిపోయినట్టుగా పాదాల చప్పుడు, తలుపులు దభేలుమని మూసుకున్న శబ్దం వినవచ్చాయి

అన్నపూర్ణ నిశ్శబ్దంగా వంట జేసుకుంటున్నట్టు, వంటింట్లోంచి పంపు స్టవ్ రొద, గిన్నెల చప్పుడు వినవస్తోంది

ఇక్కడ గదిలో తన మీద తిరగబడ్డ అంతరాత్మకు జవాబిచ్చుకోలేక సతమతమవుతోంది అనసూయ

వాళ్ళు తన్నెలా అనుకుంటున్నారు? తను వాళ్ళ బ్రతుకు యేం చేయాలని కోరి యిలా వచ్చింది?

తమను తాము బాగుచేసుకోవడంతోనే సమాజంపట్ల వ్యక్తి కర్తవ్యం పూర్తి కావడం లేదు చేతనయినంతగా ఇతర్లను కూడా ఉద్ధరించాలని వారు తన బ్రతుకు గురించి ఓ ఆవేదన ఆరాటం కనపరుస్తుంటే, తనేం తలుస్తోంది వాళ్ళ గురించి?

నవ్వుల పువ్వులతో విరాజిల్లే వారి జీవితనందనంలో నిప్పులు కురిపించాలని వచ్చింది'

ఏమయింది తనకు? తనని ఏ దెయ్యమో పట్టలేదుగదా? ఎందుకిలా వక్రించింది తన బుద్ధి?

తనని ఒకనాడు రామచంద్రం ప్రేమించాడు నిజమె! కాని, తనతో యేనాడూ చనువు తీసుకోలేదు, పెళ్ళికాక పూర్వం గాని, ఆ తర్వాత గాని అదే యింకో యువకుడయితే తను చూపిన చనువు

ఆసరాగా తీసుకుని తన శీలాన్ని దోచేసి ఉండేవాడు మరి రామచంద్రమో? ఉద్రేకానికి ఆస్కారం యివ్వకుండా, ఆలోచన మాత్రమే పొసగనిచ్చి తనతోటి తన ప్రేమను మనోహరమైన స్నేహంగా మలుచుకోవాలని తపించాడు

"అదేమిటంటీ? ఎందుకేడుస్తు న్నారు?" అన్నపూర్ణ గదిలోకి వచ్చింది కంగారుగా అనసూయకు చేరువగా వచ్చి కూర్చుంది

అప్పటికిగాని అనసూయకు అర్థం కాలేదు, తను ఏడుస్తోందని, తన కన్నీళ్ళతో తలగడ తడిసి ముద్దయిందని

"అబ్బే! యేడుస్తున్నానా?" అంటూ ఆతృతగా లేచి, చెంపలు తుడుచుకుని "స్ట్రాంగ్ కాఫీ యివ్వరూ? తల బ్రద్దలయిపోతోంది నొప్పితో" అంది అనసూయ

"ఒక్క కాఫీయే నేమిటి? టిఫిను కూడా సిద్ధం మీరు మొహం కడుక్కొని రావడమే ఆలస్యం" అంది అన్నపూర్ణ లేచిన అనసూయను బాత్‌రూంకు తీసుకెళుతూ

మొహం కడుక్కోవడమే గాదు, అలా స్నానాదికాలు కూడా ముగించి అరగంటలో వచ్చింది అనసూయ

టిఫిను తిని కాఫీ త్రాగాక "అలా ఓ అరగంట బజారుకెళ్ళి వస్తానండి ఇవాళ సాయంకాలం రైలుకే తిరిగి వెళ్ళిపోవాలనుకుంటున్నాను" అంది అనసూయ

పది నిముషాల్లో తల దువ్వుకుని, చీర మార్చుకుని వీధిలో బడింది అనసూయ

ఇందాక బాత్‌రూంలో ఉన్నప్పుడే లెక్కలు వేసుకొంది తిరుగు ప్రయాణం టిక్కట్టు డబ్బు పోను, చేతిలో యింకా పదిరూపాయలుంటాయి దోవలో తనకు కాఫీ త్రాగడానికి కూడా కానీ మిగలక పోవచ్చు అయినా ఫరవాలేదు రామచంద్రం పిల్లలకు ఏమైనా పది రూపాయలతో తినుబండారాలు కొని తీసుకురావడానికి నిశ్చయించుకుంది

బజార్లో పది రూపాయలకు విలువ లేదు రెండు క్రీమ్ బిస్కట్ పేకట్లు మాత్రం కొని తెచ్చి యిద్దరి పిల్లల చేతుల్లో చెరొకటి పెట్టింది అనసూయ

మొట్టమొదటిసారిగా ఆ యిద్దరినీ దగ్గరకు తీసుకుని ప్రేమతో ముద్దు పెట్టుకొంది

"ఎందుకండీ - యివన్నీను?" అంది అన్నపూర్ణ, పిల్లల చేతుల్లోని పేకట్లు చూసి

"ప్రయాణం అయి రావడం తొందరలో మర్చిపోయానండి పిల్లలున్న యింటికి ఒట్టి చేతులతో వెళ్ళగూడదు" అందంగా అబద్ధం చెప్పింది అనసూయ

సాయంకాలం పావు తక్కువ అయిదు కావస్తుండగా రామచంద్రం ఆఫీసునించి వచ్చాడు

రామచంద్రం రాగానే అతనితో చెప్పి వెళ్ళిపోవడానికి సిద్ధంగా వుంది అనసూయ

కనీసం ఒక్కరోజు తన ప్రయాణం వాయిదా వెయ్యమని మరీ మరీ బ్రతిమలాడింది అన్నపూర్ణ

అనసూయ మనసు మార్చుకోలేదు

అన్నపూర్ణ అందించిన కాఫీ గ్లాసుతోపాటు, అనసూయ ఆ సాయంకాలమే

ఊరికి తిరిగి వెళ్ళిపోతోందన్న వార్త కూడా అందుకున్నాడు రామచంద్రం భార్యద్వారా

"నో' నో! ఆవిడ వెళ్ళిపోతానంటే నువ్వెలా ఒప్పుకున్నావే'' అన్నాడు రామచంద్రం చిరుకోపం ప్రదర్శిస్తూ

"ఆ విషయమే నేనూ అన్నానండి కాని ఆవిడ ససేమిరా ఒప్పుకోవడం లేదు'' అంది అన్నపూర్ణ

రామచంద్రం యింకా యేమేమో అనబోయాడు కాని, మధ్యలో కల్పించుకుని "రామచంద్రం' మరీ అంత మొండిపట్టు పట్టకు నువ్వు రమ్మంటే రాలేదు, నువ్వుండమంటే ఉండిపోవడానికి'' అంది అనసూయ

"అది సరే' నువ్విలా గాలీ వానలా వచ్చి, వానాకాలం సూర్యుడిలా మాయం కావడం అర్థం కావడం లేదు ఇంతకీ ఎందుకొచ్చావో చెప్పావు కావు అసలు నువ్వొచ్చిన పని అయిందో లేదో చెప్పలేదు చూస్తే రోజంతా యింట్లోనే వున్నావు యెక్కడికీ కదల్లేదల్లే వుంది'' అన్నాడు రామచంద్రం

"అదంతా పెద్ద సీక్రెట్ నాకు చెప్పడం యిష్టం లేదు చెప్పమని బలవంతం చెయ్యకు నన్ను వెళ్ళిపోనీ' ' అంటూ వంగి రామచంద్రం, అన్నపూర్ణ పాదాలకు నమస్కరించింది అనసూయ

ఆ దంపతులిద్దరి కళ్ళల్లో ఒక్కసారిగా కన్నీళ్లు ఉబికాయి గొంతుకలు గద్గదమయ్యాయి కాసేపు యెవ్వరూ ఏమీ మాట్లాడలేక పోయారు

"చూడు అసూ' యీ సంవత్సరం లోగా నీకేదైనా ఉద్యోగం చూస్తాను నీకు ఉద్యోగం చూసి, నీ బ్రతుక్కి ఓ గమ్యం అర్థం యేర్పరచే వరకూ విశ్రమించను'' అన్నాడు రామచంద్రం అనసూయ తల నిమురుతూ

అనసూయ మనసులో అనుకుంటోంది "నాకు ఉద్యోగం దొరికినా దొరక్కపోయినా చింతలేదు ఘోరాపరాధం చెయ్యడానికి వచ్చి జ్ఞానోదయం కలిగి చెయ్యకుండా వెళ్ళిపోతున్నాను ఆ ఆనందం, ఆ తృప్తి చాలు యీ జన్మకు ''

అన్నపూర్ణతో కూడా చెప్పేసి, అక్కడ నుంచి కదలుదామని, ఆమె వైపు తిరిగితే ఆమె అక్కడ లేదు

కాని రెండు నిముషాల్లో ఓ పళ్ళెంలో జాకట్టు గుడ్డ రెండు అరటిపళ్ళు, పసుపు కుంకుమలతో వచ్చింది అక్కడకు అన్నపూర్ణ

"అబ్బే' ఎందుకండీ యివన్నీను'' అంది అనసూయ, అన్నపూర్ణ తనకు పళ్ళెం అందిస్తుంటే

"తప్పు! వద్దకూడదు తీసుకోండి'' అంటూ అనసూయ చేతిసంచిలోకి పళ్ళెంలోని వస్తువులు పంపింది అన్నపూర్ణ

అనసూయ మరి కాదనలేకపోయింది

పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని, "వస్తాను రామచంద్రం స్టేషనుకు వచ్చే ప్రయత్నం చెయ్యకు ఒక్కర్తినీ వెళ్ళగలను'' అంటూ అతడు ఆమెను స్టేషనువరకూ సాగనంపడానికి వస్తానంటున్నా విన్పించుకోకుండా వీధిలోకి నడిచి, రిక్షా కట్టించుకుని వెళ్ళిపోతున్న అనసూయను చూసి కొయ్యబొమ్మలా ఉండిపోయాడు రామచంద్రం అనసూయ ఎందుకొచ్చినట్టు, ఎందుకు వెళ్ళిపోతున్నట్టు అర్థంగాక

ఎప్పటికీ అర్థం చేసుకోలేడేమో కూడా *